క్లుప్తంగా

నెలాఖరులోగా బీమా ప్రీమియం చెల్లించాలి

తుని రూరల్: రబీ పంటల బీమా ప్రీమియం ఈ 31వ తేదీలోగా చెల్లించాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు సుంకర బుల్లిబాబు సూచించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మెట్ట ప్రాంతంలో రబీ వరిసాగు తక్కువగా ఉందన్నారు. అపరాలు ఎక్కువగా సాగవుతోందని, ఎకరాకు రూ.300 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఇటీవల సంభవించిన తుపాన్లు వల్ల పంట నష్టం ఏమీ లేదన్నారు. కోటనందూరు మండలం తప్ప సబ్‌డివిజన్‌లో పంటనష్టం లేదన్నారు. కోతలు పూర్తయిన తర్వాత అపరాలు సాగు చేసే రైతులు ఎకరాకు 16 కిలోల విత్తనాలు జల్లుకుంటే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందున్న బాధితుడిని పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. వాకపల్లి గ్రామానికి చెందిన మురుకుర్తి రాణి, మురుకుర్తి అప్పన్న, ధర్మవరం గ్రామానికి చెందన పాస్టర్ బంగార్రాజు ఇటీవల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో గాయపడ్డారు. మురుకుర్తి రాణి కాకినాడ జీజీహెచ్‌లో, బంగార్రాజు సిద్ధార్థ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. అప్పన్న చికిత్స పొందుతూ మృతి చెందారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బర్ల గోవింద్, అవ్వ ఆదినారాయణ, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, మాగపు శివ పాల్గొన్నారు.

మోదీ పాలనలో అన్నివర్గాలకూ మేలు



పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన అయ్యప్పను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో అన్ని వర్గాలకూ మేలు జరుగుతోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. పట్టణంలో శనివారం బీజేపీ నేత పైల సుభాష్‌చంద్రబోస్ అధ్యక్షతన పార్టీ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా పైల అయ్యప్ప ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికీ వివరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరార. అనంతరం పైల అయ్యప్పను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కామినేని జయశ్రీ, మట్ట మంగరాజు, సింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ మహేష్

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఒకేషనల్ ఆటోమోటివ్ ట్రేడ్ విభాగంలో భాగంగా హోండా షోరూమ్‌ను విజిట్ చేశారు. ఒకేషనల్ ట్రైనర్ బి.మహేష్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు హోండా వాహనాల తయారీ, రిపేర్లపై అవగాహన కల్పించినట్టు మహేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెన్నా శ్రీనివాసరావు, ఎం.చిన్నిబాబు, ఎం.లోవప్రసాద్, దోశే వెంకటరమణ, డి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217

పరకే బంగారమాయె

- ఎండు గడ్డికి భారీగా పెరిగిన గిరాకీ
- ట్రాక్టర్ వరిగడ్డి రూ.12 వేలకు పైనే..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రత్తిపాడు రూరల్: వ్యవసాయంతో వచ్చిన సాంకేతికత పాడి రైతులకు ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. మెట్టలో సైతం రైతులు యంత్రాలతో వరికోతలు చేపట్టడంతో ఎండుగడ్డి దొరకడం లేదు. పశువులకు వరిగడ్డి కొరత ఏర్పడటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇతర ప్రాంతాల్లో గడ్డి కొని దానిని ఇక్కడకు తెచ్చుకుంటున్నారు. ఫలితంగా ట్రాక్టర్ గడ్డికి రూ.12 వేలకు పైనే ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు.

5,400 హెక్టార్లలో సాగు

ప్రత్తిపాడు మండలంలో వరి సాగు సాధారణ విస్తీర్ణం 4,400 హెక్టార్లు కాగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 5,400 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగి వరిగడ్డి కొరత ఏర్పడటంతో పాడి రైతులకు కష్టాలు తప్పడం లేదు.

పశుగ్రాసం కొరత

గతంలో పాడి రైతులు పశువులను ప్రత్యేకంగా బీడు, మెట్ట, కొండ ప్రాంతాలకు తరలించి మేపుకొనేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనుమరుగైంది. యంత్రాల వినియోగంతో బీడు, మెట్ట, కొండ ప్రాంతాలను చదును చేసి సాగులోకి తీసుకురావడంతో పశువులకు పశుగ్రాసం దొరికే పరిస్థితి లేకుండా పోయింది.

కూలీల కొరతతో..

కూలీల కొరత, యంత్రాల వినియోగం కారణంగా గడ్డి కొరత ఏర్పడుతోంది. కూలీలు దొరికినా కూలి ధరలు పెరగడం, యంత్రాలతో నిర్దిష్ట సమయంలో వరికోత, నూర్పిడి పనులు ఏకకాలంలో పూర్తి అవ్వడంతో రైతులు ఎక్కువగా యంత్రాల పైనే మక్కువ చూపిస్తున్నారు. యంత్రాలతో ప్రతికూల వాతావరణంలో సైతం ఆరుకాలం పండించిన పంటను రక్షించుకోవడం సాధ్యమవుతుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి కోతకు యంత్రాలను వినియోగించే రైతుల సంఖ్య భారీగా పెరగడంతో గడ్డి కొరత ఏర్పడింది. ఇతర మండలాలకు చెందిన పాడి రైతులు సైతం మండలంలో గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో గడ్డికి డిమాండ్ పెరిగింది. గతంలో రూ.4 వేలు ఉన్న వరి గడ్డి ఈ ఏడాది రూ.7 వేలకు చేరుకుంది. కూలీలకు రూ.2,400, రవాణా చార్జి కనీసం రూ.2,500 వేలు అదనంగా చెల్లించవలసి వస్తుంది. ట్రాక్టర్ గడ్డి ఇంటికి వచ్చేసరికి రూ.12 వేలకు పైనే అవుతుంది. ఎంత ధర అయినా చెల్లించి గడ్డి కొనుగోలు చేద్దామంటే దొరకని పరిస్థితి నెలకొందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రత్తిపాడు మండలంలో మెషీన్‌తో వరి కోతలు



యంత్రంతో వరికోత కోయడం వల్ల ముక్కలైన గడ్డిని ఒబ్బిడి చేస్తున్న రైతు

పశువుల వివరాలు

మండలంలో 2,935, గేదెలు 11,372 ఉన్నాయి. పశుగ్రాసం కొరత, వరి గడ్డికి భారీగా డిమాండ్ పెరగడంతో పాడి పరిశ్రమకు గడ్డుకాలం నెలకొంది. దీంతో ఖర్చు పెరిగి రాబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ట్రాక్టర్‌పై తరలిస్తున్న వరిగడ్డి

పశుపోషణ భారంగా మారింది



ప్రస్తుతం యంత్రాల వినియోగం కారణంగా వరి గడ్డి కొరత ఏర్పడింది. ఎకరం పొలంలో వరి గడ్డి రూ.3,500లకు కొనాల్సి వస్తోంది. ట్రాక్టర్‌కు రెండు ఎకరాల్లో గడ్డి అవసరమవుతుంది. ట్రాక్టర్ గడ్డికి కూలీలు, రవాణా ఖర్చుతో కలిపి రూ.12 వేలకు పైనే ఖర్చు అవుతుంది. దీంతో పాడి పశువుల పోషణ తలకు మించిన భారం అవుతుంది.

– అనకాపల్లి నాగేశ్వరరావు, .
దర్మవరం, ప్రత్తిపాడు మండలం

సత్యదేవుని దర్శించిన బీహార్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ



రత్నగిరిపై సిద్ధార్థ్, విజయలక్ష్మి దంపతులకు స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం: బీహార్ రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ సిద్ధార్థ్ శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. భార్య ఎస్.విజయలక్ష్మి (ఐఏఎస్)తో కలిసి ఆలయానికి వచ్చిన ఆయనకు ఈఓ వి.సుబ్బారావు ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ అందజేశారు. ఏఈఓ కృష్ణారావు వారి వెంట ఉన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి

గండేపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల అధ్యక్షురాలిగా చక్కా లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శిగా డి.రాజబాబు ఎన్నికయ్యారు. గండేపల్లిలో శనివారం యూటీఎఫ్ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ మండల నూతన అధ్యక్షురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



పెద్దనాపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



ఏవీ నగరంలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మురార్జీ

ఏలేశ్వరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండలంలోని పెద్దనాపల్లిలో శనివారం తహసీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఎటువంటి భూ సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 27 దరఖాస్తులు

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో శనివారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సదస్సుకు రైతుల నుంచి 27 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ మురార్జీ తెలిపారు. మ్యుటేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. త్వరితగతిన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజారావు, వీఆర్వోలు,పాల్గొన్నారు.

బాల్యాన్ని తుంచే అనాగరికతకు అడ్డుకట్ట వేయాలి

కిర్లంపూడి: బాల్యాన్ని తుంచేసే అనాగరికతకు అడ్డుకట్ట వేయాలని పెద్దాపురం ఎస్‌డీపీఓ శ్రీహరిరాజు అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శనివారం కిర్లంపూడి ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ అధ్యక్షతన పంచాయతీ సెక్రటరీలు, సీహెచ్‌ఓలు, వీఏలు, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, వీఆర్‌ఓలు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎంపీడీఓ హెచ్ హరికృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మధ్యలో చదువు ఆపేసిన 11 నుంచి 18 సంవత్సరాల లోపు బాలికలను చదివించేలా ప్రోత్సహించడం, ఆరోగ్యం-పోషణ, బాల్యవివాహాల నివారణ, ఆత్మరక్షణ-భద్రత, మానసిక ఆరోగ్యం, జీవనోపాధి అవకాశాలు, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలన, శాంతి భద్రతల పరిక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, వైద్యాధికారి హేమాంజలి, ఏపీఎం వేదకుమారి, సూపర్‌వైజర్లు బూసమ్మ, సునీత, ఖరీమునిషా, ఎంఈఓలు టి.జోసెఫ్, మక్కా చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్‌డీపీఓ శ్రీహరిరాజు



హాజరైన సిబ్బంది

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



నీలాద్రిరావుపేటలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గండేపల్లి: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ అన్నారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో శనివారం మన్మోహన్‌సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు వత్సవాయి సత్యనారాయణ రాజు(బాబు), డాక్టర్ నక్కా సత్యనారాయణ, నేదూరి భాస్కరరావు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



శ్రీప్రకాష్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత, విజయ్‌ప్రకాష్

తుని: ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో శ్రీప్రకాష్ వార్షిక క్యాలెండర్‌ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించినట్టు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ రతన్ టాటా కుటుంబం ఆధునిక భారతదేశానికి నిజమైన నిర్మాతలు అని కొనియాడారు. దేశంలో వేలాది మందికి ఉపాధి కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశాభివృద్ధిలో ప్రత్యేకతను చాటుకున్న రతన్‌టాటాకు నివాళులర్పించేందుకు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించామని విజయ్‌ప్రకాష్ తెలిపారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్, ఉపాధి కల్పన జిల్లా మేనేజర్ కల్యాణి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ గోవిందరావు పాల్గొన్నారు.

భాస్కరబాబు మృతి పార్టీకి తీరని లోటు



బలరామపురంలో సోమరౌతు రాజాను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

రౌతులపూడి: మండలంలోని బలరామపురం మాజీ సర్పంచ్ సోమరౌతు భాస్కర్‌వెంకన్నదొర (భాస్కరబాబు) మృతి గ్రామానికి, వైఎస్సార్ సీపీకి తీరని లోటు అని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. బలరామపురంలోని భాస్కరబాబు కుమారుడు సోమరౌతు రాజా, కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాస్కరబాబు నాలుగు సార్లు బలరామపురం సర్పంచ్‌గా, ఒక పర్యాయం ఎంపీటీసీ సభ్యుడిగా, రౌతులపూడి కో ఆపరేటివ్ సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా విశేష సేవలు అందించారని కొనియాడారు. మూడు దశాబ్దాలుగా అందరికీ సుపరిచితులైన భాస్కరబాబు ప్రస్తుతం మన మధ్య లేకపోవటం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గౌతు స్వామి, గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పులి మధు, సోమరౌతు తిరుముల వెంకన్నదొర, ఉప్పంపాలెం సర్పంచ్ యెనుముల కోటిబాబు, అంకంరెడ్డి సతీష్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, కో ఆపరేటివ్ సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ రుత్తల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'జంపా' కుటుంబానికి ముద్రగడ పరామర్శ

ప్రత్తిపాడు: గ్రామంలో ఇటీవల మృతి చెందిన విశ్రాంత ఉద్యోగి జంపా వెంకటేశ్వరరావు కుటుంబాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. వెంకటేశ్వరరావు మరణానికి గల కారణాలను ఆయన కుమారుడు త్రిమూర్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని ఏలూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన కొట్టేటి పెద కాపు, కొట్టేటి సత్యనారాయణ కుటుంబాలను ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, ఏడిద రెడ్డి నాయుడు, గౌతు స్వామి, ఆర్‌ఎంపీల సంఘ ప్రతినిధి డాక్టర్ అందే చిట్టికొండ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెంలో సారా బట్టీలపై ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు.

జగ్గంపేట మండలంలో..

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల, తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. సారా తయారీకి పాల్పడుతున్న మల్లిసాల గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితుడికి న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఎంపీడీఓపై దాడికి నిరసన



గండేపల్లిలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుతుపుతున్న అధికారులు

గండేపల్లి: అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓపై జరిగిన దాడికి వ్యతిరేకంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం అధికారులు నిరసన వ్యక్తం చేశారు. దాడిని ఖండిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని, ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గండేపల్లి ఎంపీడీఓ నాతి బుజ్జి, ఎంఈఓ కెహెచ్ నాయక్, ఎన్‌ఆర్జీఎస్, విద్యాశాఖ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

10న షెడ్యూల్డ్ కులాల తుది జాబితా ప్రచురణ

ప్రత్తిపాడు: షెడ్యూల్డ్ కులాల తుది జాబితాను జనవరి 10న ప్రచురించనున్నట్టు ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సామాజిక తనిఖీ నిర్వహించి, అభ్యంతరాలు తెలుసుకునేందుకు ఈ నెల 26న జాబితాను ప్రచురించామన్నారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 31వ తేదీ లోపు గ్రామ రెవెన్యూ అధికారికి తెలియజేయవచ్చన్నారు. ఎటువంటి అభ్యంతరాలు రాకుంటే 2025 జనవరి 10న తుది జాబితా ప్రచురిస్తామని వివరించారు.

ఈ నెల 31 లోపు అభ్యంతరాలు తెలపాలి

తొండంగి: గ్రామాల్లో షెడ్యూల్ కులాల సర్వే నిమిత్తం ఈ నెల 31వ తేదీ లోపు అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారులకు తెలపాలని తహసీల్దార్ మురార్జీ సూచించారు. ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం గ్రామాల్లో షెడ్యూలు కులాల సర్వేకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో అందుబాటులో ఉంచిన జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే ఆయా గ్రామ వీఆర్వోకు తెలపాలన్నారు. వచ్చిన అభ్యంతరాలు పరిశీలించి జాబితాలో సవరణలు చేసి తుది జాబితా వచ్చే ఏడాది జనవరి 10న రూపొందిస్తారని చెప్పారు.

సామాజిక తనిఖీ గ్రామసభ



ప్రత్తిపాడు గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్ఆర్పీ సింహాద్రి

ప్రత్తిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను తనిఖీ చేసినట్టు సామాజిక తనిఖీ స్టేట్ రీసోర్సు పర్సన్ (ఎస్ఆర్పీ) సింహాద్రి తెలిపారు. ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టామన్నారు. ఈ పనులపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమార స్వామి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

2 నుంచి సంక్రాంతి క్రీడా పోటీలు

జగ్గంపేట: సంక్రాంతిని పురస్కరించుకుని యువత, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జనవరి 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. సంక్రాంతి సమయంలో యువత జూదం, అశ్లీల నృత్యాలు, మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ సంప్రదాయ క్రీడా పోటీలు ఏర్పాటు చేశామన్నారు. జగ్గంపేట డిగ్రీ కాలేజీ ఆవరణలో యువకులకు వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, మహిళలకు ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఆకర్షణీయ బహుమతులు అందజేస్తామన్నారు. జగ్గంపేట మండలానికి చెందిన వారు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఆసక్తి కలిగిన యువత జనవరి 1వ తేదీ సాయంత్రం లోపు 63034 13248, 970362 18013 నంబర్లకు కాల్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

రహదారుల నిర్మాణాలు వేగవంతం



రమణయ్యపేటలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం: రహదారుల నిర్మాణాలు వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మండలంలోని జె.అన్నవరం, రమణయ్యపేట గ్రామాల్లో శనివారం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ నయీముల్లాతో కలిసి ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీకి ముఖద్వారమైన రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకు అర్‌అండ్‌బీ రహదారి పనులు చేపడతామన్నారు. రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పునర్నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ఎస్‌జీవీ సుబ్బరాజు, నూకతాటి ఈశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు.. ఇదేం తీరు !

- తాళ్లూరులో దారి మళ్లించి సాగుకు వినియోగం
- పట్టించుకోని అధికారులు



తాగునీటి కుళాయి నుంచి పైపు ద్వారా వస్తున్న నీరు



కొబ్బరితోటకు మళ్లించిన తాగునీరు

గండేపల్లి: ప్రజల దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ కుళాయిల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న తాగునీరు దారిమళ్లుతోంది. దీనిని కొందరు సాగు కోసం (కొబ్బరి తోటకు) వినియోగిస్తున్నారు. పంచాయతీ అధికారుల సాక్షిగా తాగునీరు వృథా అవుతున్నప్పటికి కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు మండిపడుతున్నారు. మండలంలోని తాళ్లూరు పంచాయతీ సమీపంలోని తాగునీటి కుళాయి (బావవరం ఫిల్టర్ బెడ్ పైప్‌లైన్) నీటిని పక్కనే ఉన్న కొబ్బరి తోటకు ఉపయోగిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. కుళాయి పైపు అమర్చి తద్వారా నీటిని మళ్లించి తాగునీటిని దుర్వినియోగం చేస్తున్నారు. ఏలేరు జలాలు జగ్గంపేట మండలం బావవరంలోని ఫిల్టర్ బెడ్‌కు చేరుతాయి. అక్కడ నీటిని శుభ్రపరిచి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్ట్ ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కాగా ఆ పైపులైన్‌కు అనధికారికంగా ట్యాప్ ఏర్పాటు చేసి తాగునీటికి సాగు మళ్లిస్తున్నారు. తాళ్లూరు నుంచి యల్లమిల్లి వెళ్లే మార్గంలో ఫిల్టర్ బెడ్ పైపులైన్‌కు అనధికారికంగా ట్యాప్‌లు ఏర్పాటు చేయడంతో దిగువ గ్రామాలకు తాగునీరు అందడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి దారి మళ్లిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.